క్లుప్తంగా

4న వైఎస్సార్‌సీపీ సమావేశం

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో సోమవారం వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెంలో రామాలయంలో ప్రతిష్ఠించిన అభయాంజనేయ స్వామి విగ్రహానికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాన్ని ప్రతిష్ఠించి నాలుగు సంవత్సరాలు కావస్తున్న నేపథ్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డస్ట్‌బిన్‌ల పంపిణీ


జడ్డంగిలో దుకాణదారులకు డస్ట్‌బిన్‌లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు


రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఉన్న పలువురు దుకాణదారులకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు వీలుగా పంచాయతీ కల్పించిన డస్ట్‌బిన్‌లను సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్తను డస్ట్‌బిన్‌లలో వేయాలని సూచించారు. పాలిథిన్ కవర్లు వినియోగించొద్దని ఆదేశించారు. నాయకుడు తాతారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం


వాకింగ్ పోటీలో సీఐ హిమగిరి, పోలీస్ సిబ్బంది

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వాకింగ్ పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అరకులోయ సీఐ హిమగిరి మాట్లాడుతూ వ్యాయామంతోనే ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. వాకింగ్ పోటీలో పోలీసు సిబ్బందితో పాటు ఆయన పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం


పెంటయ్య (ఫైల్)

ముంచంగిపుట్టు: మండలంలోని దార్లెల పంచాయతీ మాజీ సర్పంచ్ మండి పెంటయ్య(74) అనారోగ్యంతో మృతి చెందారు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్ చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలియజేశారు.

రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కుమారి, సర్పంచ్ ప్రియాంక

గూడెంకొత్తవీధి: మండలంలోని మొండిగెడ్డ పంచాయతీ తోటలగొంది గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ బోయినకుమారితో కలిసి సర్పంచి అడపా ప్రియాంక శుక్రవారం ప్రారంభించారు. వార్డు సభ్యులు లక్ష్మణరావు, కూటమి నాయకులు సత్తిబాబు, వీరబాబు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాగుల సాగు.. లాభాలు బాగు


పెదబయలులో రాగుల పంట

- మార్కెట్లో డిమాండ్
- అధిక వర్షపాతంతో పెద్ద వెన్నులు
- పెరిగిన సాగు విస్తీర్ణం

పెదబయలు: మండలంలో రాగుల సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో రాగులు (చోడి) గిరాకీ ఉంది. మంచి ధరలు వస్తుండడంతో రైతులు పంట సాగుపై దృష్టి సారించారు. మండలంలోని సీతగుంట, అడుగులపుట్టు, అరడకోట, గలగండ, గంపరాయి, పెదకోడాపల్లి, సీకరి పంచాయతీల్లో సాగు ఎక్కువగా చేస్తున్నారు. గతంలో మెట్ట ప్రాంతంలో విత్తనాలు చల్లే పంట విధానం చేసే రైతులు ఇప్పుడు వరి పంట మాదిరిగా నారువేసి నాట్లు పద్ధతి అవలంభిస్తున్నారు.దీంతో దిగుబడి ఎక్కువగా వస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వర్షపాతం ఎక్కువగా ఉండడంతో పంటకు అనుకూలంగా ఉందంటున్నారు. మండలంలో గత ఏడాది కంటే ఈ సారి సాగు విస్తీర్ణం పెరిగింది. మండలంలో సుమారు 2,500 ఎకరాల్లో రాగుల సాగు చేస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో పంట వెన్నులు పెద్దవిగా ఉన్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన వినియోగం

మండలంలో రాగులుకు మంచి గిరాకీ ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రాగులు కిలో రూ.38.48లకు కొనుగోలు చేసింది. దీంతో పాటు పలు వ్యవసాయ శాఖ, పలు స్వచ్ఛంద సంస్థలు వివిధ రకాల చిరు ధాన్యాలు ఉచితంగా రైతులకు పంపిణీ చేయడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. మన్యంలో రాగులతో చేసిన అంబలి, ఇతర వంటకాలకు ఎక్కువగా ప్రాధాన్యత ఉంటుంది. రక్తహీనత సమస్య లేకుండా ఉండేందుకు వైద్యులు రోజువారీ ఆహారంలో రాగులు తీసుకోవాలని సూచించడంతో వినియోగం బాగా పెరిగింది. రాగుల పంటలో అంతర పంటగా సామలు, జొన్నలు సాగుచేస్తున్నారు. ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలల్లో తప్పనిసరిగా విద్యార్థులకు రాగి అంబలి రోజు వారీగా అందించడంతో ప్రభుత్వం రాగులు ఆర్‌బికేల ద్వారా కొనుగోలు చేసి జీసీసీకి సరఫరా చేస్తుంది.

ఆశాజనకంగా దిగుబడి



ఈ ఏడాది రాగుల పంటకు వాతావరణం అనుకూలంగా ఉంది. గత రెండేళ్ల నుంచి సకాలంలో వర్షాలు కురుస్తున్నాయి. పంట దిగుబడి బాగుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగులను కిలో రూ.38.48 ధరతో రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేసింది. ఈ ఏడాది వర్షాలు బాగా పడడడంతో పంట బాగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

– పి.భాస్కరరావు, రైతు, పెదబయలు గ్రామం

వాతావరణం అనుకూలం



ఈ ఏడాది పంటలకు వాతావరణం అనుకూలంగా ఉంది. రాగుల పంటకు సంబంధించి రైతులు స్థానిక వంగడాలతో పాటుగా వ్యవసాయ శాఖ అందించిన విత్తనాలు వేశారు. రైతులకు పంటల సాగుపై ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. కొత్త వంగడాలతో మంచి దిగుబడి వస్తుందని రైతులకు సూచించాం.రాగుల పంట బాగుంది. పెద్ద వెన్నులు దర్శనమిస్తున్నాయి.

– ఎ. శ్రీనివాస్, ఏవో, పెదబయలు మండలం

మద్దతు ధర కల్పించేందుకు చర్యలు


డుంబ్రిగుడలో వెలుగు ఆధ్వర్యంలో పంటల సేకరణ కేంద్రం


ఉద్యానవన శాఖాధికారి శిరీష

సాక్షి ఎఫెక్ట్..

డుంబ్రిగుడ: మండలంలోని రైతులు పండించిన వివిధ పంటలకు మద్దతు ధరలు కల్పించేందుకు మూడు సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు ఉద్యానవన శాఖాధికారి కె.శిరీష చెప్పారు. చిలగడ దుంప సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు అందడం లేదని దళారులు దోచుకుంటున్నారనే నేపథ్యంలో గత నెల 30 'సాక్షి'లో 'చిల్లు'గడ శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఉద్యానవన శాఖాధికారి కె.శిరీష స్పందించారు. డుంబ్రిగుడ మండల కేంద్రంలోని వెలుగుశాఖ ఆధ్వర్యంలో కొర్రాయి పంచాయతీ బొందుగుడలో వికాస సంస్థకు చెందిన వనం మనం రైతు సంఘానికి చెందిన ఒక యూనిట్, కొర్రాయి పంచాయతీ జాముగుడలో గిరిపుత్రుల రైతు సంఘానికి చెందిన మరో యూనిట్ ద్వారా రైతుల నుంచి పంటల సేకరణ చేపడుతున్నట్టు చెప్పారు. ఉద్యానవన శాఖ ద్వారా రైతు సంఘాలను ప్రోత్సాహిస్తున్నామని, సేకరణ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, పంటలకు మద్దతు ధరలకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీంతో దళారీల సమస్య తగ్గుతుందన్నారు. ఆయా రైతు సంఘాల ద్వారా నేరుగా విశాఖపట్నం, విజయవాడ, విజయనగరం తదితర ప్రాంతాలకు మార్కెటింగ్ చేసేందుకు సదుపాయం కలుగుతుందని మండల ఉద్యానవన శాఖ అధికారి కె.శిరీష చెప్పారు.

రైతులకు సూచనలు


రైతులకు సూచనలిస్తున్న ఏవో రాబిన్ సుదర్శన్

ఎటపాక: మండలంలోని కృష్ణవరంలో మండల వ్యవసాయాధికారి రాబిన్ సుదర్శన్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం రైతులకు ఎంతో మేలు చేస్తోందన్నారు. పంటల సాగుపై రైతులకు ఇస్తున్న సూచనలు, సలహాలు బాగా ఉపయోగపడుతున్నాయన్నారు. పొటాష్ ఎరువు ఉపయోగాలను రైతులకు వివరించారు. వీఏఏ భార్గవి, ఏపీసీఎన్ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జి వెంకట్, శ్రీను, రాజులు, సమ్మయ్య, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన


బొదిలిగూడలో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ పోర్తిమ్మ, నాయకులు

ముంచంగిపుట్టు: మండలంలోని జర్జుల పంచాయతీ బొదిలిగూడ గ్రామంలో డ్రైనేజీ పనులకు సర్పంచ్ డి.పోర్తిమ్మ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెడ్పీ నిధులు రూ.5లక్షలతో డ్రైనేజీ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. డ్రైనేజీ లేక వర్షం పడితే వీధులు అధ్వానంగా మారుతున్నాయని, ఈ మేరకు సమస్య పరిష్కారానికి జెడ్పీ నిధులు మంజూరైనట్టు చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు స్థానికుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, మండల పార్టీ అధ్యక్షురాలు పద్మారావు, జోలాపుట్టు, మాకవరం సర్పంచులు నీలకంఠం, గంగాధర్, ఉపసర్పంచ్ సాధురామ్, నాయకులు తిరుపతిరావు, జగన్నాథం, చందర్‌రావు పాల్గొన్నారు.

తాగునీటి బోరు పనులు ప్రారంభం


మాకవరంలో బోరు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ గంగాధర్, నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరం పంచాయతీ కేంద్రంలో జెడ్పీ నిధులు రూ.1.40లక్షలతో చేపడుతున్న తాగునీటి బోరు నిర్మాణ పనులను సర్పంచ్ గంగాధర్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర చొరవతో నీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

అడ్డతీగల: మండలంలోని మట్లపాడులో ఎస్ఐ బి.వినోద్ శుక్రవారం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సారా తయారీ, విక్రయాలు, గంజాయి సాగు, రవాణా వంటివి చేయవద్దన్నారు.పొలాల్లో అడవి జంతువులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అమరజీవికి ఘన నివాళి


పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


పి.యర్రగొండలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

అరకులోయటౌన్: ప్రజలకు ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి అమరుడైన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం శ్లాఘనీయమన్నారు. ఆయన ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. అరకులోయ పార్లమెంట్ నాయకుడు కమిడి అశోక్, ఎంపీటీసీ సభ్యుడు శత్రుఘ్న, వైఎస్సార్‌సీపీ నాయకులు స్వాభి రామ్మూర్తి, అర్జున్, రామ్‌చందూర్, గురుమూర్తి పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం భావకవి కృష్ణశాస్త్రి జయంతిని నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ నేడు

వై.రామవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి స్కిల్ డెవలప్‌మెంట్‌పై శనివారం శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. శిక్షణ తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. మండల ఎగువ ప్రాంత కార్యదర్శులు, సిబ్బంది జూమ్ కాన్ఫరెన్స్‌కు హాజరుకావాలని కోరారు.

సందడిగా దీపావళి


పాడేరులో దీపావళి దివ్వె కొడుతున్న కుటుంబం


ముంచంగిపుట్టులో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


పాడేరు మోదకొండమ్మ తల్లి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు


డుంబ్రిగుడలో దీపావళి సంబరాలు


హుకుంపేటలో సందడి చేస్తున్న చిన్నారులు

సాక్షి,పాడేరు: వెలుగుల దీపావళి పండగను గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లను అందంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. మట్టి ప్రమిదలను వరుసగా పేర్చి వెలిగించారు. కళ్లు మిరిమిట్లు గొలిపేలా దీపాలంకరణ ఆకట్టుకుంది. ఇళ్లల్లో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆముదం, చెరకు గడలతో జ్యోతులు వెలిగిస్తూ సంప్రదాయ ప్రకారం పండుగ జరుపుకున్నారు. కుటుంబ సభ్యులందరు దీపాలు వెలిగించి బాణసంచా కాల్చి సందడి చేశారు. గ్రామాలన్నీ వెలుగు దివ్వెలతో, టపాసులు, చిచ్చు బుడ్లు, భూ చక్రాల కాంతులతో బాంబుల మోతతో దద్దరిల్లాయి. రాత్రి 11 గంటల వరకు ప్రతి ఇంటా దీపావళి బాణసంచా సందడి నెలకొంది.

ఆలయాల్లో దీపారాధన

ఆలయాల్లో భక్తులు దీపారాధన చేశారు.ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ తల్లి ఆలయంలో దీపావళి పండగను ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఘనంగా ప్రారంభించారు. ఆలయంలో దీపాలు వెలిగించడంతో పాటు బాణసంచా కాల్చారు ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు


అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను కలిసిన విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రసాద్


అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగను కలిసిన ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌ప్రసాద్


హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయటౌన్: అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రసాద్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని గిరి గ్రామాల్లో విద్యుత్ సౌకర్యాలపై చర్చించారు. త్వరలో పాడేరులో జరగనున్న విద్యుత్ శాఖ, ఇతర అధికారుల సమావేశానికి హాజరుకావాలని ఎమెల్యేను ఆయన కోరారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మత్స్యలింగం సూచించారు. అర్హులైన వారికి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో డీఈఈ భాస్కర్‌రావు, ఏఈఈ సత్యనారాయణ, కంద్రూం సర్పంచ్ కిముడు హరి తదితరులున్నారు.

చట్ట వ్యతిరేక పనులు చేపడితే చర్యలు

మండల కేంద్రంలో గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు చట్ట వ్యతిరేక పనులు చేపడితే చర్యలు తప్పవన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పీఎం జన్‌మన్ కార్యక్రమం ద్వారా గృహాలు మంజూరు చేయాలని సూచించారు. పీఎం జన్‌మన్ గృహాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణా లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందించాలన్నారు. డీఈఈ వి.రాజుబాబు, ఏఈఈలు కాంతి, కృష్ణారావు, నాగేశ్వరరావు, ఈశ్వరి, చినబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలో ఇటీవల ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ప్రేమ్‌సాగర్ అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీడీవోను ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

సర్దార్ పటేల్ ఆశయ సాధనకు కృషి



అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ ఆదేశాల మేరకు రాష్ట్రీయ ఏక్తా దివస్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజ్ మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు కృషి చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయ సాధన కృషి చేయాలన్నారు. రాజనీతి శాస్త్రం అధ్యాపకులు నాగబాబు, ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, మొష్యా అనిత కుమారి మాట్లాడుతూ ఈ ర్యాలీ ద్వారా సమాజంలో దేశ ఐక్యత పట్ల అవగాహన కల్పించామన్నారు. అధ్యాపకులు కొండబాబు, లచ్చన్న, అప్పారావు, కామేశ్వరరావు, సోంబాబు, భవాని, వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవో, ఎస్ఐలకు సన్మానం


ఎంపీడీవో రామకృష్ణను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు


ఎస్ఐ భూషణంను సన్మానిస్తున్న నాయకులు

గంగవరం: మండలంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో పి.జి.రామకృష్ణ, ఎస్ఐ డి.భూషణంలను యూటీఎఫ్ మండల శాఖ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వారిని ఘనంగా సన్మానించారు. ఈ మేరకు యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాంబాబు దొర, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పాఠశాలల స్థితిగతులను, విద్యార్థుల అభ్యసన తదితర అంశాలను ఎంపీడీవో రామకృష్ణ యూటీఎఫ్ నాయకులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలకు సంబంధించి సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి విద్యార్థికి ఆధార్ నెంబర్ ఉండేలా చూడాలన్నారు. ఎస్ఐ భూషణం మాట్లాడుతూ ఉపాధ్యాయులు భావితరాలకు మార్గదర్శకులని, వారికి సమాజంలో ఉన్నత స్థానం ఉంటుందన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు కృష్ణ ,రఘుబాబు దొర, రుక్మిణి దేవి, రామకృష్ణారెడ్డి, సత్య కిరణ్‌రెడ్డి, భాస్కరరావు, సాయిబాబా, వెంకన్న దొర, దామోదర్ పాల్గొన్నారు.

శ్రమదానంతో జంగిల్ క్లియరెన్స్


తుప్పలను తొలగిస్తున్న ఆటో కార్మికులు, మాజీ సర్పంచ్ కొండలరావు

అనంతగిరి(అరకులోయ రూరల్): మండలంలోని వెంగడ పంచాయతీ కేంద్రంలో మాజీ సర్పంచ్ సివెరి కొండలరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆటో కార్మికులతో గ్రామస్తులు కలిసి శ్రమదానంతో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కొండలరావు మాట్లాడుతూ వెంగడ పంచాయతీ కేంద్రం నుంచి డొంకపుట్టు గ్రామం వరకు సుమారు అయిదు కిలోమీటర్లు రహదారికి ఇరువైపులా తుప్పలు పెరగడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను అధికారులు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దీంతో స్థానిక ఆటో డ్రైవర్లు, గ్రామస్తులు కలిసి శ్రమదానంతో రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించారు. సమస్య పరిష్కారమవడంతో పలువురు అభినందించారు. గ్రామస్తులు కృష్ణ, అనిల్, శుభన్న, రామ్మూర్తి, దేముడు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అనుమతులు రద్దుచేయాలని డిమాండ్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయ రూరల్: మండలంలోని మాదల పంచాయతీ దాబుగుడ అడవిలో మైనింగ్ అనుమతులు తక్షణమే రద్దు చేయాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో సంఘం నాయకుడు రమేష్ మాట్లాడుతూ దాబుగుడ కొండపై అక్రమంగా మైనింగ్ చేసేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎటువంటి గ్రామ తీర్మాణాలు లేకుండా తవ్వకాలు జరిపితే ఉపేక్షించేది లేదన్నారు. అధికారులు మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మైనింగ్‌కు వ్యతిరేకంగా ఈనెల 6న సభ నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు దశరథ్, భాస్కర్‌రావు, రామన్న, సూరన్న పాల్గొన్నారు.